# రూపాయితో ఉద్యోగం

టెన్త్ పాసయి కాలేజీలో చేరాలా లేక ఏదైనా టెక్నికల్ కోర్సు చదవాలా అనే ఆలోచనలో వున్న రాజాకి తను ఊరికే కూచోకుండ ఏదో చేయాలనే తపన వుంది.

రోజూ పేపరు చూడటం, రాజాకి అలవాటు. అతన్ని ఆ రోజు ఒక ప్రకటన ఆకర్షించింది.

"మా కంపెనీకి చాలామంది ఏజంట్లు కావాలి. టెన్త్ ప్యాసయినా సరే, ఫెయిలయినా సరే నెలకు జీతం రు. 425/–వివరాలకు క్రింది యడ్రసుకు రూపాయి మనియార్డరు చేయవలసింది."

ఇదేమిటి? ఆశ్చర్యంగా వుందే. యం. ఏ. చదివిన బాబాయ్ గాలికి తిరుగుతున్నాడు. బి.ఇడి. చదివిన అన్నయ్య ప్రైవేట్లు చెప్పుకుంటున్నాడు. యమ్. యస్సి. చదివిన తమ ఇంటి ప్రక్కన వాళ్ళబ్బాయి ఎంప్లాయి మెంట్ ఎక్స్చేంజీల చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నాడు.

అయితే వాళ్ళందరూ ఈ ప్రకటన చూసివుండరు. పిచ్చివాళ్ళు.

పేపరు చదవడమేగాని, పేపర్లో మూల మూలనా ఏం ప్రకటన లున్నాయో చూసుకోవద్దూ. అయితే మనకి ఉద్యోగం దొరికి అందులో చేరిపోతే బావుంటుంది. ఎంత చదువు చదివితే మాత్రం ఏం ఉపయోగం? రాజా ఆలోచనలు ఇలా కొనసాగాయి. వెంటనే ఆలస్యం చేయకుండా ఆ యడ్రసుకు రూపాయి మనీ ఆర్డరు చేశాడు.

ఆ ప్రకటన కత్తిరించి, దానితోపాటు మనీఆర్డరు రూపన్ కూడ జత చేసి జాగ్రత్తగా దాచుకున్నాడు.

"రాజా మరి ఇంటర్‌లో చేరతావా? ఐ.టి.ఐ లో చేరతావా? పాలి టెక్నిక్ పరీక్షలు వ్రాస్తావా" అంటూ తండ్రి వచ్చేడు.

8 )

"లేదు. నాన్నగారూ మద్రాసులో ఉద్యోగం కోసం రూపాయి మనీ ఆర్డరు చేశాను. అది వస్తే ఉద్యోగానికి వెళ్ళిపోతాను. ఎందుకు ఎంత చదివినా ఉద్యోగం రాదు. అనవసరంగా డబ్బు ఖర్చు. శారీరక శ్రమ" అన్నాడు.

వీడికి మద్రాసులో ఉద్యోగమేమిటి? అనుకుని "ఏమిటిరా నువ్వు వాగేది" అన్నాడు రాజా తండ్రి.

"ఇదిగో చూడండి" అని తను భద్రంగా దాచుకున్న పేపర్ కటింగ్ చూపించాడు విజయ గర్వంతో.

ఆయన అది చూడగానే నీరసంతో "ఇదా" అన్నారు. "అదేమిటి నాన్నగారూ అలా అంటారు" అన్నాడు రాజా.

"బాబూ ఇది ఒక వ్యాపారం-వాళ్ళకి నీలాంటి ఏమీ తెలియని వాళ్ళు ఎన్నో రూపాయలు యమ్. వో చేస్తుంటారు. ఈ వ్యాపారంచేసేది నిరుద్యోగులే, నీకు అప్లికేషన్ వివరాలు అసలు రావు నీ రూపాయతో ఇంతేసంగతులు"

"ఏం కాదు నాన్నగారు చూద్దాం కదా" అన్నాడు లోకం సంగతి తెలియని రాజా.

"సరే నీమాట కాదని ఎందుకనాలి? నువ్వే చెప్తావు తరువాత" అని ఆయన వెళ్ళిపోయారు.

రాజా, రోజూ పోస్టుకోసం ఎదురు చూస్తూనేవున్నాడు.

—o—